11వ పాఠం జూన్ 6-12

# శ్రమలు మరియు ఆశాభంగములు

సబ్బాతు మధ్యాహ్నము జూన్ 6

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : మార్కు 4:35-41, మార్కు 5:21-34, యోబు 19:23-27, లూకా 24:13-27, రోమా 8:18-28.**

**కంఠతవచనం : "అంతేకాదు ఓర్పును, ఓర్పు పరీక్షను పరీక్ష నిరీక్షణను కలుగజేయునని ఎరిగి శ్రమలయందును అతిశయ పడుదుము. ఎందుకనగా ఈ నిరీక్షణ మనలను సిగ్గుపరచదు. మనకు అనుగ్రహించబడిన పరిశుద్ధాత్మ ద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరింపబడియున్నది" (రోమా 5:3-5).**

ఒక గాలివాన ఆరంభమైన కొద్ది సమయానికి చిన్న బాలిక నడుచుకుంటూ తన గృహము చేరుకున్నది. అప్పటికే ఆకాశములో కారుమబ్బులు కమ్ముకొని వున్నది. కెమెరా చిత్రాలు తీసేటప్పుడు దానికి అమర్చిన విద్యుత్తు బల్బు మెరుపులను పుట్టించినట్లు మేఘములలో మెరుపులు వస్తున్నవి. ఆ చిన్న బాలిక తన ఇంటికి చేరుటకు పరుగెత్తింది. ఆ బాలిక ఇంటికి చేరినప్పుడు తండ్రి ఆమెను దుప్పటితో కప్పుతూ నీవు పరిగెత్తుతున్నప్పుడు మధ్యలో నీవు ఆగిపోవడం నేను చూశాను. నీవెందుకు ఆకాశంలో ఏర్పడుతున్న మెరుపులను చూచి నవ్వితివి? అని అడిగెను.

అందుకు ఆ బాలిక ఆకాశములో వచ్చుచున్న మెరుపులు చిత్రాలను తీసేటప్పుడు వచ్చే ప్రకాశవంతమైన వెలుగును పోలియున్నది. దేవుడు నా ఛాయాచిత్రాన్ని తీస్తున్నాడు అని నాలో నేను ఊహించుకున్నాను అని చెప్పెను.

నీ జీవితమునకు సంబంధించిన తుఫానులు ఎదురైనప్పుడు నీవేమి చేస్తావు? వాటికి భయపడి నీ తల వంచుకుంటావా? లేక నీకు దేవుడున్నాడని ఆయన మీద నమ్మకముంచి ఆయన వైపు పైకి చూస్తావా?

కష్ట సమయాలలో మనము తరచు మాట్లాడే లేక చేసే పనుల విషయమును ఈవారం మనం అధ్యయనం చేయబోవుచున్నాము. మన జీవితములో ఎదురయ్యే శ్రమలు మరియు ఆశా భంగములను ఆధారము చేసుకొని దేవునితో వున్నందున బాంధవ్యము ఏ విధముగా బలపడగలదు అనే విషయమును గురించి ఆలోచన చేయబోవుచున్నాము.

జూన్ 13, సబ్బాతు దినమున ఈ వారమునకు ఏర్పాటు చేయబడి సబ్బాతు బడి పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

ఆదివారం జూన్ 7

## జీవిత తుఫానులు (మార్కు 4:35-41)

యేసు గలిలయ సముద్ర తీరమున ప్రోగుబడిన పెద్ద జనసమూహముతో మాట్లాడుతూ ఒక దినమంతా గడిపెను.

ఆ దినమే సాయంకాలమైనప్పుడు తన శిష్యులతో అద్దరికి పోవుదమని ఆయన చెప్పెను. (మార్కు 4:35) ఒక తుఫాను రాబోవుచున్నదని యేసుకు తెలుసు. అయినప్పటికీ మనము సముద్రము అవతల ఒడ్డున పోవుదమని తన శిష్యులతో చెప్పెను. ఆయనను వెంబడించే వారికి ఒక ప్రాముఖ్యమైన జీవిత పాఠమును నేర్పించాలని యేసు కోరుకొనెను.

**మార్కు 4:35-41లో వ్రాయబడిన తుఫానును గూర్చి చదువుడి. విశ్వాసమును గూర్చి ఈ వృత్తాంతము ఏ పాఠమును బోధిస్తున్నది?**

ఈ వృత్తాంతము నుంచి క్రింద సూచించడిన ఈ నాలుగు భావములను గూర్చి ఆలోచించుడి:

1. వారు ప్రయాణించుచున్న నావలో వున్న ఏకైక తలగడపై యేసు నిద్రించుచుండెను. యేసు ఈ లోకములో జీవించిన కాలములో చేపలు వేటాడే నావలకు తరచుగా ఒకే ఒక తలగడ ఉండెడిది. నావ వెనుక భాగములో ఆ నావను నడిపే సారధి దాని మీద కూర్చునేవాడు. అతడు ఆ నావ ఎట్లు వెళ్లాలో లేక ఎక్కడికి వెళ్లాలో ఆ చోటుకు నడిపించేవాడు. అందుచేత ఈ నావ వెనుక భాగములో ఆ నావను నడిపే సారధిగా యేసు వున్నాడు. అయితే చుక్కాని యొద్ద వున్న యేసు నిద్రించెను.

2. ఆ నావలో ప్రయాణిస్తున్న యేసు యొక్క అనుచరులలో కొంత మందికి సముద్ర ప్రయాణము చేసే అనుభవము లేదు. అయితే వారిలో పేతురు, యాకోబు మరియు యోహాను ఉన్నారు. వారికి వృత్తి రీత్యా చేపలు పట్టే అనుభవము చాలా ఎక్కువ కలదు. అందుచేత అకస్మాత్తుగా సముద్రము మీద గాలివాన చెలరేగినను ఏ విధముగా ప్రయాణించాలో వారికి తెలుసు.

3. ఆ సందర్భములో యేసు ఆ నావలో నిద్రించుచున్నాడు అనే విషయమును మార్కు ఒక్కడే ఆ విధముగా వ్రాశాడు. ఆ భయంకరమైన గాలి వానలో వారు మరణిస్తున్నారనే భయము యేసు యొక్క అనుచరులలో కలిగెను. మరొకసారి గమనించండి. ఆ సమయములో ఆ నావ మీద యేసు ఏమి చేయుచున్నాడు? ఆ నావ యొక్క వెనుక భాగములో యేసు నిద్రించుచున్నాడు.

4. గాలి వానలో వారు చిక్కుకున్నప్పుడు యేసు శిష్యులు ఆయనను నిందించుట మొదలు పెట్టారు. బోధకుడా మేము నశించిపోవుచున్నాము. నీకు చింత లేదా అని ఆయన మీద నేరారోపణ చేశారు. యేసుకు వారి మీద వున్న ప్రేమను వారు శంకించారు. ఆయన యందు వారు చెడుగా తలంచారు. కష్ట సమయాలలో మనము కూడా చాలా తరచుగా అట్లే ప్రవర్తిస్తాము. నిరాశ చెందినపుడు మనలను మనమే కాపాడుకొనుటకు ప్రయత్నిస్తూ

వుంటాము. కొన్ని సందర్భాలలో మనకు వేదన, నష్టము కలిగినపుడు దేవుని యొక్క ప్రేమ సంరక్షణ గూర్చి ప్రశ్నిస్తూ వుంటాము. దేవుడు కొన్ని ఉపకారములు చేయాలని కోరుకుంటాము. అవి సంభవించినపుడు వేదన చెందుదురు. అయితే దేవుడు మాత్రము పెద్ద పెద్ద ఉపద్రవములలో జీవిత తుఫానులలో ఆశ్చర్యకరముగా ప్రేమతో పనిచేస్తాడు. ఆయన మన కొరకు పనిచేయుచున్నాడని మనకు కనపడకపోయినా ఎల్లప్పుడు ఆయనపై ఆధారపడవచ్చును. జీవిత తుఫానులను ఎదుర్కొనేటప్పుడు ఆయన సన్నిధి మనతో నుండును. తుఫానులను నియంత్రించలేనపుడు దేవుడు తన స్వాధీనములో వుంచుకొని మనకు సహాయము చేయును.

**జీవిత తుఫానులు చెలరేగినపుడు మీరేమి చేస్తారు? నీ హృదయములో దేవునికి సమీపముగా నిన్ను ఆ తుఫానులు చేర్చునా? 2 కొరింథి 5:7లో వున్న బైబిలు సత్యము ప్రకారము నీవెప్పుడు జీవించెదవు?**

## సోమవారం — జూన్ 8

## నీబాధ నివారణయైనది (మార్కు 5:21-34)

మరుసటి దినమున పెందలకడనే గలిలయ సముద్ర తీరమున ఒక గొప్ప జన సమూహము యేసు తిరిగి అక్కడకు వస్తాడని ఎదురుచూస్తున్నారు. వారు అనుకొనినట్లు ఒక దోనె సముద్రపు ఒడ్డునకు చేరెను. యేసు ఆ దోనెలో నుండి దిగి జనసమూహము యొద్దకు వెళ్లెను. జన సమూహము కూడా ఆయన చెంతకు చేరిరి. యేసు కపెర్నహూములోనికి నడిచివెళ్లుచుండగా జన సమూహము ఆయనను వెంబడించిరి. యేసు ప్రయాణమై వెళ్లుచుండగా యాయీరను యూదయ నాయకుడు వచ్చి తన కుమార్తె జబ్బుపడియున్నది గనుక నీవు వచ్చి ఆమెను స్వస్థపరచమని యేసును అడిగెను.

అనేక సంవత్సరముల నుండి అనారోగ్యముతో బాధపడుచున్న ఒక స్త్రీ ఆ జనసమూహములో ఉన్నది. ఆ స్త్రీ తనకున్న ఆస్తినంతటిని వైద్యులపైనే వ్యయము చేసెను. అయితే ఆమెకు ఎంత మాత్రమును ప్రయోజనము లేక మరింత సంకట పడెను. (మార్కు 5:26) అటువంటి స్థితిలో ఆమె గలిలయ ప్రాంతము నుండి వచ్చిన స్వస్థపరచే వానిని గూర్చి వినెను. తన హృదయములో ఎంతో నిరీక్షణతో ఆ దినమున పెందలకడనే తన ఇంటిని విడిచి అటువైపు వెళ్లుచున్న యేసును వెంబడించుచున్న జన సమూహముతో చేరెను. అట్లా వెళ్లుచుండగా వారు ఆమెను ప్రక్కకు గెంటివేస్తున్నారు. అదే సమయములో ఆ స్త్రీ యేసును కనుగొని తన హృదయములో ఈ విధముగా తలంచెను. నేను ఆయన వస్త్రములు మాత్రము ముట్టిన బాగుపడుదుననుకొనెను. (మార్కు 5:28)

**మార్కు 5:21-34లో ఆ వృత్తాంతమును చదువుడి. ఆ వృత్తాంతములో ఏమి సంభవించినది? దాని నుండి ఏమి నేర్చుకొనగలము?**

ఆ జనసమూహములో తప్పిపోయిన వారి యెడల ఒంటరిగా వున్నవారి యెడల అనారోగ్యముతో పీడింపబడుచున్న ప్రజల యెడల యేసు తన ప్రేమను కనుపరచినట్లు ఈ వృత్తాంతము చూపించుచున్నది. ఆ దినమున ఆ జనసమూహములోని అనేక మంది యేసును ముట్టుకొనిరి. అయితే వారందరిలో ఒకే ఒక వ్యక్తి మాత్రము విశ్వాసముతో యేసును ముట్టుకొనిరి. ఆమె యేసును ముట్టుకొనుట వలన స్వస్థత పొందలేదు. ఆమె యొక్క విశ్వాసము కవలన ఆమె బాధ నివారణయైనది. (మార్కు 5:34) యేసును ఎవరైనా మరియు ఎప్పుడైనా విశ్వాసముతో ముట్టుకొనిన యెడల రక్షకుడు వారిని గూర్చి అడిగేవాడు. ఆయన చుట్టూ ఉన్న జనసమూహము ఒకరినొకరు అటు ఇటు త్రోసుకుంటూ ఇతరులను నెట్టివేయుచు, యేసుపై పడిపోవుచుండగా ఆ స్త్రీ యేసు యొక్క వస్త్రమును ముట్టుకొనిన విషయము ప్రత్యేకమైనదిగా ఆయన గుర్తించెను. – ఎలెన్ జి వైట్, యుగయుగాల ఆకాంక్ష, పుట 344. యేసు ధరించిన వస్త్రములకు ప్రత్యేకమైన శక్తి ఏమియు లేదు. ఆ స్త్రీ కనుపర్చిన ఆమె విశ్వాసము మరియు ఆయన వస్త్రమును ముట్టుకొనవలెననెడి ఆమె తీర్మానము వలన యేసు ఆమెను స్వస్థపరచెను.

ఆ స్త్రీ యేసు యొక్క వస్త్రమును ముట్టుకొనక పూర్వము ఆమె చాలా బలహీనముగా ఉన్నది. ఆమె పడుతున్న వేదనను బట్టి ఆమె తన ఇంటి యొద్దనే విశ్రాంతి తీసుకొనుచూ ఉండవచ్చును. అయితే ఆ ఉదయ కాలమున ఆమె యేసును వెదకుచూ వెళ్లెను. అందుచేత ఆమె ఆయనకు సమీపముగా చేరుకొనగలిగెను. నేడు యేసు మనలను తనకు సమీపముగా రమ్మని కోరుచున్నాడు. (మత్తయి 11:28,29)

**ఈ స్త్రీ ఎంతగానో వేదన చెందినది. ఆమెకు యేసు యొక్క అవసరము చాలా ఎక్కువగా వున్నది. రోమా 5:3-5లో వున్న బైబిలు సత్యములను ఆమె ఏ విధముగా చూపెను? నీ జీవితములో కూడా నీవు ఏ విధముగా వాటిని చూపించగలవు?**

## మంగళవారం జూన్ 9

## యోబు (యోబు 19:23-27)

బైబిలులో పేర్కొనబడిన వేదనలతో బాధపడిన మనుష్యులను గూర్చి మాట్లాడేటప్పుడు ఎక్కువగా ఎవరు గుర్తుకువస్తారు? ఎక్కువ మంది ప్రజలు యోబును గురించి జ్ఞాపకం చేసుకుంటారు. యోబు తన సంపదనంతటిని కోల్పోయెను. (యోబు 1:14-17) యోబు తన పిల్లలనందరినీ మరియు ఆరోగ్యమును కోల్పోయెను. (యోబు 1:18,19) అతని భార్య వచ్చి నీవు ఇంకను యదార్థతను వదలక యుందువా? దేవుని దూషించి మరణము కమ్మనెను. (యోబు 2:9)

కొన్ని దినములు అయిన తర్వాత యోబు యొక్క స్నేహితులు అతని దర్శించుటకు వచ్చెను. యోబును చూచి వారు చాలా ఆశ్చర్యమునకు గురయ్యారు. వారు ఏమియు మాట్లాడలేకపోయిరి. అతని యొద్ద వారు నిశ్శబ్దముగా ఏడు దినములు కూర్చుండిరి. (యోబు

2:13) అంతిమముగా అతని స్నేహితులు మాట్లాడుట ఆరంభించిరి. యోబు ఎదుర్కొనుచున్న శ్రమలను గూర్చి, దుర్దశను గూర్చి విశ్లేషణము చేయుట ఆరంభించిరి. అయితే వారి మాటలను యోబును మరింత ఎక్కువగా బాధకు గురిచేసెను. యోబు యొక్క స్నేహితులలో ముగ్గురు అతనిని నిందించిరి. యోబు ఎదుర్కొనుచున్న శ్రమలకు అతడు రహస్యముగా చేసిన పాపములే కారణమని నమ్మి వారు అతని మీద నేరారోపణ చేసిరి. యోబు చేసిన పాపమును గూర్చి దేవునిని పాపక్షమాపణ కోరి ఇక అటువంటి పాపమును చేయకుండా జీవించమని వారు అతనితో చెప్పిరి. (యోబు 8,11,15) యోబుకు కలిగిన దురవస్థను చూచి వారిలో ఒక స్నేహితుడు ఈ విధముగా పలికెను. నిశ్చయముగా భక్తిహీనులని వాసములకు ఇట్టి గతి పట్టును. దేవుని ఎరుగని వారి స్థలము ఇట్టిది. (యోబు 18:21)

**యోబు 19:23-27, యోబు 23:8-12 చదువుడి. యోబు ఏ విధముగా జవాబిచ్చెను?**

యోబుకు ఆ శ్రమలు ఎందుకు కలిగెనో తెలియదు. అయితే యోబు మాత్రము తన విశ్వాసమును కాపాడుకొనుచు, దేవునిని ఏ విధముగా నిందించలేదు. నేను నా తల్లి గర్భములో నుండి దిగంబరినై వచ్చితిని, దిగంబరినై అక్కడికి తిరిగి వెళ్లెదను. యెహోవా ఇచ్చెను, యెహోవా తీసుకొనిపోయెను. యెహోవా నామమునకు స్తుతి కలుగును గాక. (యోబు 1:21)

సాతానుడు కూడా మనకు బాధను, శ్రమలను, నష్టమును, కష్ట సమయములను కలుగజేయగలడు. ప్రేమామయుడైన దేవుని యందు మనకున్న విశ్వాసమును నాశనము చేయాలని అతడు కోరుకుంటాడు. అటువంటి పరిస్థితులకు ఈ క్రింద సూచించిన రెండు విధానాలలో ఏదో ఒక విధానమును ఎంచుకుని మనము జవాబు ఇవ్వవచ్చును. 1. మనము దేవునిని నిందించి ఆయనను తిరస్కరించవచ్చును. 2. దేవునిని మన శక్తినంతటిని ఉపయోగించి బిగువుగా హత్తుకొనవచ్చును. దేవునితో భవిష్యత్తులో శాశ్వతకాలము జీవించనైయుండగా, ఈ స్వల్ప జీవితకాలములో ఎదురయ్యే సమస్యలు ఏ పాటివని తప్పని సరిగా గుర్తుంచుకోవాలి. (2 కొరింథీ 4:16-18) నేడు మంచి చెడులకు మధ్య జరుగుచున్న పోరాటములో అర్థము కాని విషయాలున్నవి. ఆ పరిస్థితుల్లో దేవుని యందు నమ్మకముంచి ఆయనను హత్తుకొని జీవించాలి.

**మీరొక చిక్కు సమస్యలో యున్నప్పుడు తక్షణమే దేవుని యొద్దకు వెళ్లుడి. బైబిలును, నోటు బుక్కు తీసుకుని ప్రకృతిలో దేవునితో కూర్చొండి. రోమా 5:3-5. వ్రాయుడి. వేర్వేరు వర్తమానాలు ధ్యానించుడి. దేవుని సంరక్షణ, చూపే ప్రేమ యందు మీరున్నారని సంపూర్ణముగా నమ్ముడి.**

**బుధవారం** **జూన్ 10**

## ఎమ్మాయినకు వెళ్లే మార్గము (లూకా 24:13-27)

గడిచిన కొన్ని వారములలో వారికి ఎదురైన అనుభవములను గురించి యేసు యొక్క అనుచరులలో ఇద్దరు మాట్లాడుకొనుచున్నారు. ముందుగా యేసు యెరూషలేములో

ప్రవేశించి దేవాలయమును శుద్ధి చేసెను. తరువాత మేడ గదిలో శిష్యులతో యేసు ప్రభు రాత్రి భోజన సంస్కారమును ఆచరించెను. గెత్సెమనె తోటలో యేసు ప్రార్థించెను. డబ్బు కొరకు యూదా ఇస్కరియోతు యేసును అమ్మివేసెను. యేసును విచారణ చేసిరి. సైనికులు కొందరు యేసును హేళన చేసి ఆయనను కొరడాలతో కొట్టిరి. యేసును సిలువకు మేకులతో కొట్టి సిలువ వేసిరి. యేసును వెంబడించిన ఆ ఇరువురు మనుష్యులు యేసు సిలువ మీద మాట్లాడిన చివరి మాటలను జ్ఞాపకము చేసుకున్నారు. అటు తరువాత యేసు మరణించెను. ఆ మధ్యాహ్న సమయమున ఆకాశము నల్లని మేఘములు కమ్మెను. పైనుండి క్రిందకు దేవాలయముల యొక్క తెర చిరిగినది. సమాధులు తెరువబడినవి. మృతులైనవారు లేచిరి. సిలువ మీద నుండి యేసు యొక్క దేహమును దింపిరి. మరియు సబ్బాతు దినము ఆరంభము కాక పూర్వమే యేసు యొక్క దేహమును సమాధి చేసిరి. యేసును వెంబడించిన వారి జీవితములలో ఈ అనుభవము ఎక్కువ ఆశాభంగమును కలిగించెను. వారు చాలా విచారమునకు గురైనారు. నిరుత్సాహము చెందారు. కలవరము చెందారు. కాలమంతటిలో యేసు యొక్క మరణమునకు సంబంధించిన వృత్తాంతము అత్యంత ఆశ్చర్యకరమైనదని వారు గ్రహించలేకపోయిరి. ఆ ఇద్దరు మనుష్యులు ఎమ్మాయిలకు వెళ్లే మార్గములో నడుచుకొని వెళ్లుచుండగా యేసు వచ్చి వారితో నడిచి వెళ్లెను.

**లూకా 24:13-27లో వ్రాయబడిన సంభాషణను చదువుడి. 1.యేసును వెంబడించినవారు. 2 యేసును గూర్చి రెండు వేర్వేరు అభిప్రాయాలు ధ్యానించుడి.**

యేసును వెంబడించిన వారిలో ఇద్దరు యెరూషలేమునకు పరుగెత్తుకొని వెళ్లిరి. ఎమ్మాయిలకు వెళ్లే మార్గములో సంభవించిన విషయాలను యేసును వెంబడించిన వారితో పంచుకొనిరి. (లూకా 24:33, 34) అక్కడ సమావేశమైన ఆ గుంపు మధ్యలోనికి యేసు వచ్చి నిలువబడెను. యేసును వెంబడించేవారు, యేసును చూచినప్పుడు వారు భయపడిరి. యేసు తన అనుచరులను అడిగిన ప్రశ్నలను పరిశీలించుడి. మీరెందుకు కలవరపడుచున్నారు? మీరు చూచుచున్న నా విషయమై మీ హృదయములలో సందేహము కలుగనేల? (లూకా 24:38)

యేసు నేడు ఇదే వర్తమానమును మనతో పంచుకొనుచున్నాడు. మనము శ్రమలను ఎదుర్కొనుచుండగా యేసు మన ప్రక్కనే నడుచుచున్నాడనే విషయాన్ని మనము తరచుగా మరచిపోతూ వుంటాము. తరచుగా మనము ఆయనను చూడము. ఈ వృత్తాంతములో ఇంకా ఎన్నో విషయాలు ఇమిడియున్నవనే సంగతిని తరచుగా మరచిపోతుంటాము. చాలా సందర్భాలలో విచారమునకు గురై మన హృదయాలలో అనేక అనుమానాలకు చోటిస్తూ వుంటాము. యేసు తన హస్తాలతో మన జీవితాలను ఎత్తిపట్టుకొనియున్నాడనే విషయాన్ని మరచిపోతున్నాము. మన జీవితాలలో ఏమి సంభవించుచున్నదో యేసు కన్నా మనకే ఎక్కువ తెలుసు అని ఊహించుకుంటాము. (లూకా 24:18)

క్రైస్తవులుగా మనకు శ్రమలు, నిరుత్సాహములు, ఆశాభంగములు ఎదురైనపుడు ఏమి చేయాలో అనే విషయములో బైబిలు మనకు ఎన్నో మంచి సలహాలను అనుగ్రహించుచున్నది. ఈ క్రింద పేర్కొనబడిన కొన్ని వాక్యాలను చదువుటకు సమయము కేటాయించండి. రోమా 8:28, ఫిలిప్పీ 4:4-13, యాకోబు 1:2-4, 12, 2 కొరింథీ 12:9,10. ఇతరులెవరైనా శ్రమలను ఎదుర్కొనుచుండగా వారితో ఆదరణ మాటలను పంచుకొనుటకు, ఈ వాక్యాల నుండి మూడు వర్తమానాలను వ్రాయండి. ఈ వాక్యములను చదువునపుడు 2 కొరింథీ 1:4ను జ్ఞాపకముంచుకొనుడి.

**గురువారం** **జూన్ 11**

## నీవు యేసును చూడగోరుచున్నావా? (రోమా 8:18,28)

నీవు విచారముగా వున్నప్పుడు లేక ఆశాభంగము కలిగినప్పుడు, యేసును చూడాలనే కోరిన నీకు ఎప్పుడైనా సంభవించినదా? ఈ క్రింద పేర్కొనబడిన కలను గురించి చదువుడి. నీవే ఆ కలను కంటున్నావని నీ మనస్సులో ఊహించుకో.

నా ముఖమును నా చేతులలో పెట్టుకొని కూర్చుని యున్నాను. నేను చాలా విచారముగా ఉంటిని. ఈ విధముగా తలంచితిని. యేసే గనుక ఈ భూమి మీద ఉండి ఉంటే నేను ఆయన చెంతకు వెళ్లియుండే వాడిని. ఆయన సన్నిధిలో నేను మోకరించి నేను ఎదుర్కొనుచున్న శ్రమలన్నింటిని గూర్చిన ఆందోళన వివరించి యుండెడివాడిని. అప్పుడు యేసు నాకు తన కనికరమును చూపించియుండెడివాడు. అటు తరువాత ఆయన ఎల్లప్పుడూ సేవిస్తూ సేవ చేసేవాడు. ఆ సమయములోనే ద్వారము తెరువబడెను. సౌందర్యవంతుడైన ఒక వ్యక్తి లోనికి ప్రవేశించెను. ఆయన కనికరముతో నన్ను చూచి ఈ విధముగా పలికెను. నీవు యేసును చూడగోరుచున్నావా? ఆయన ఇక్కడే వున్నాడు. నీవు కావాలనుకుంటే ఆయనను చూడుము. నీకు కలిగిన సమస్తమును తీసుకొని నన్ను వెంబడించు.

ఈ సమాచారమును నేను వినగానే ఎంతో సంతోషించితిని. వెంటనే నాకు కలిగిన వస్తువులను, కొంత డబ్బును నావెంట తీసుకొని నా మార్గదర్శకుని వెంబడించాను. చాలా ఎత్తుగా వున్న మెట్లపై అతడు నన్ను నడిపించెను. ఆ మెట్లు బలముగాను, స్థిరముగా వున్నట్లు నాకు కనబడలేదు. నేను ఆ మెట్లను ఎక్కుట ఆరంభించాను. ఆ మెట్లపై నడుచుచుండగా, నామార్గ దర్శకుడు నా దృష్టిని పైనున్న వాటిపై పెట్టమని హెచ్చరించెను. నేను ఆ విధముగా చేయని యెడల నా కళ్లు తిరిగి క్రిందకు పడిపోయే పరిస్థితి అక్కడ ఉన్నది. పైమెట్టు వరకు నడిచి వెళ్లాలని ప్రయత్నించిన అనేక మందిలో కొందరు అక్కడకు చేరక ముందే పడిపోయిరి.

చివరకు పైనున్న మెట్టుకు మేము చేరుకుని మాముందున్న ద్వారము యొద్ద నిలువబడితిమి. నా వెంబడి తీసుకొని వెళ్లిన వస్తువులన్నింటిని అక్కడ విడిచిపెట్టమని నా వెంబడి వున్న మార్గదర్శకుడు చెప్పెను. నేను చాలా సంతోషముగా వాటిని అక్కడే

విడిచిపెట్టితిని. నా మార్గదర్శకుడు ద్వారము తెరిచి లోనికి ప్రవేశించమని నాతో చెప్పెను. అంతట నేను యేసుకు ఎదురుగా నిలువబడితిని. ఆయన ముఖము చాలా సౌందర్యముగా మరియు గంభీరముగాను ప్రేమగా ఉన్నది. యేసు నావైపు చూచెను. నా జీవితమును గురించి, నా రహస్యములను గురించి, నా భావములను గురించి ఆయనకు తెలుసు అని నేను అర్థము చేసుకున్నాను.

నన్ను ఆయన నేత్రములు పరిశీలనగా చూస్తుండగా నేను దాగుకొనుటకు ప్రయత్నించితిని. అయితే యేసు నవ్వుతూ నా చెంతకు వచ్చెను. నా తలపైన ఆయన చేయి వేసి భయపడవద్దు అని చెప్పెను. నేను మునుపెన్నడూ ఎరుగనటువంటి ఆనందము ఆయన స్వరము వినినప్పుడు కలిగెను. ఆ ఆనందములో నేను ఏమీ మాట్లాడలేకపోతిని. ఆయన పాదముల చెంత కూలిపోతిని. అట్లా పడియుండగా నేను నిజముగా పరలోకములో ఉన్నట్లు భావించితిని. అక్కడ నేను ఎంతో సమాధానముతోను ఎంతో క్షేమము గాను ఉన్నాను. కొంత సేపటికి నాకు తిరిగి మరలా నాశక్తి వచ్చినది. నేను నిలువబడితిని. యేసు యొక్క ప్రేమతో నిండిన కన్నులు నన్ను చూచుచున్నవి. ఆయన యొక్క చిరునవ్వు నా హృదయమును ఆనందముతో నింపెను. ఆయన ప్రేమతో నేను నింపబడితిని.

"ఈ కల నాకు నిరీక్షణను, విశ్వాసమును కలుగజేసెను. దేవునిని నమ్ముకొనుటలో వున్న మాధుర్యమును అర్థము చేసుకొనుటకు, అనుభవించుటకు నాకు గొప్ప అవకాశము లభించెను". – ఎలెన్ జి వైట్, తొలి వ్రాతలు, పుటలు 79–81.

మన వేదనలలోను,' ఆశాభంగములలోను, యేసు వైపు చూడవలెను. అంతట ఆయన మన యెడల దేవునికున్న ప్రేమను చూపించును.

**ఇప్పటికిప్పుడు రోమా 8:18,20 ఎటువంటి నిరీక్షణను కలుగజేయుచున్నవి?**

## శుక్రవారం జూన్ 12

## అదనపు అధ్యయనం

మనము కొన్ని కష్టసమయాలను ఎదుర్కొనుచున్నప్పుడు దేవునిని మనము గట్టిగా హత్తుకొని ఉండాలి. ఈ త్రిమాసములో మనము చదువుకొనిన అంశాలు దేవునితో బలముగా మన బాంధవ్యమును కొనసాగించాలనే అంశము మీదనే చదువుతున్నాము. ఈ జీవితములో మనందరము ఏదో ఒకరకమైన కష్టములను ఎదుర్కొనుచున్నవారమే. అనారోగ్యములు క్షీణించిపోతున్న ఆరోగ్యము, ఆర్థిక పరమైన ఇబ్బందులు కలతలతో విడిపోయిన వివాహ బంధములు మనము ఎక్కువగా ప్రేమించే వారిలో ఎవరో ఒకరు మరణించుట లేక ఇతర విషయాలలో ఆశాభంగములు వంటివి అనేకమైనవి ఉంటాయి. ఇటువంటి చీకటి సమయాలలో ఈ క్రింద సూచించిన ప్రశ్నలను మనము అధ్యయనము చేసిన సబ్బాతు బడి పాఠములను గూర్చి ఆలోచించుడి.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. ఇప్పటికిప్పుడు నీవు ఎదుర్కొనుచున్న శ్రమలు ఏమిటి? దేవుని యొక్క ప్రేమను గురించి, నీకు ఎదురయ్యే కఠిన సమస్యలు ఏమి బోధిస్తున్నాయి? నేడు దేవుని యొక్క ప్రేమను స్పష్టముగా ఎట్లు నీవు నేర్చుకొనగలవు?

2. శత్రువు యొక్క స్వరము కన్నా దేవుని స్వరము కొరకు నీ జీవితములో చివరగా ఎప్పుడు ప్రార్థించితివి? గుర్తుంచుకోండి. దొంగ (సాతానుడు) దొంగతనము చేయుట కొరకు మరియు నాశనము చేయుట కొరకే వచ్చుననియు, దేవుడు మాత్రము జీవమును అనుగ్రహించుటకు వచ్చునని గుర్తుంచుకో (యోహాను 10:10).

3. నీ హృదయములో గర్వము లేకుండా ఉన్నదా? నీ జీవితము దేవుని స్వాధీనములో వున్నదని నీవు నమ్ముచున్నావా? దేవుడు నిన్ను కష్టసమయములలో సహితము నడిపించుచున్నాడని నీవు నమ్ముచున్నావా? నీవు ఆ విధముగా నమ్మిన యెడల వ్యక్తిగతముగా దేవుడు నిన్ను ప్రేమించుచున్నాడని నీవు ఎట్లు నమ్మగలవు?

4. బైబిలు అనబడే దేవుని వాక్యమును నీవు అనుదినము చదువుచున్నావా? కష్టసమయాలలో నీ యెడల ఆయన ప్రేమ సహాయపడునట్లు ప్రార్థించు.

5. నీకు నిజముగా సహాయపడువాడు దేవుడే. ఆయన వాక్యములు నిన్ను విడువకుండా వుండునట్లు ఆయన యందు నీ నమ్మకముంచుము. దేవుని ప్రేమ, కనికరము, సలహాలు, సహాయము అవసరమని చివరగా ఎప్పుడు ప్రార్థించితివి? (హెబ్రీ 13:5)

6. విశ్వాసము విషయములో నీవు బలహీనముగా ఉంటే, బలమైన విశ్వాసము కొరకు ప్రార్థించు. నేను ఎక్కువగా నమ్మునట్లు సహాయము చేయమని ప్రార్థించు. (మార్కు 9:24) మిమ్ములను ప్రోత్సహించే వారితో ఎక్కువ సమయం గడుపుము.

7. సాధారణముగా పేద ప్రజలను గూర్చి ఎక్కువగా ఎవరూ జాగ్రత్త తీసుకొనరు. వారికి ఎదురయ్యే శ్రమలు, గాయముల వంటివి ఎవరికీ ఇష్టముండదు. అయితే మీరు బలహీనముగా వున్నప్పుడు నా శక్తి మీకు బలముగా పనిచేయును అని వర్తమానము తెలియజేయుచున్నది. (2 కొరింథీ 12:9) ఈ వర్తమానము ఎవరో ఒకరి జీవితమునకు మేలు కలిగే విధముగా వుంటుంది. నేడు ఈ వర్తమానముతో ఎవరో ఒకరిని ప్రోత్సహించుటకు నీవు ఆలోచించు.

❋✶❋